@PAKK

# విదురుని సందేశాలు





రచన :
బ్రహ్మర్షి
తటవర్తి వీరరాఘవరావు

# విదురుని సందేశాలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : ఫిబ్రవరి, 2026
ప్రతులు : 2,000

వెల : **రూ. 40/-**

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 17) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 18) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 19) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు

వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు

ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# విదురుడి సందేశాలు

::1::

మూర్ఖుడు కొన్ని పరిధులు పెట్టుకొని ఆ పరిధిలోనే జీవిస్తూ ఉంటాడు కానీ వివేకవంతుడు ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నం చేస్తాడు. తన చుట్టూ ఉండే వారి దగ్గర జ్ఞానం నేర్చుకుంటూ ఎదిగే ప్రయత్నం చేస్తాడు, అందరికీ ఆదర్శప్రాయుడు అవుతాడు. వివేకవంతుల ద్వారా ఎంతో మంది తమలోని మూర్ఖత్వపు లక్షణాలు తొలగించుకుంటూ వారు కూడా వివేక వంతులుగా మారుతారు.

ఒక మూర్ఖుడి ఆలోచనలు ఎలా ఉంటాయో విదురుడు చెప్పిన కొన్ని విషయాలు తెలుసుకుందాం:

**"మూర్ఖుడు తనకే అన్నీ తెలుసు అని అనుకుంటాడు."**

మన సొసైటీ లోనే తీసుకుంటే పత్రి గారు ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని చెబితే, కొంతమంది మాస్టర్స్ "మ్యూజిక్ మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేయిస్తున్నారు. అదేమంటే పత్రి గారు చేయించారు కదా? అని అంటున్నారు. కానీ పత్రి గారు **"నేను చేసింది చేయకండి, నేను చెప్పింది చేయండి"** అని స్పష్టంగా చెప్పడం జరిగింది. అయినా కూడా కొంతమంది మాస్టర్స్ కి అర్థం కావడం లేదు. ఎంతసేపు "నేను పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్ళు" అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు.

అటువంటి వారందరికీ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం సరైన ధ్యానం అని బాగా అర్థం చేయడం కోసం "ఏది సరైన ధ్యానం" అనే ఒక పుస్తకాన్ని కూడా విడుదల చేయడం జరిగింది. వారు ఆ పుస్తకాన్ని ఒక్కసారి చదవడానికి కూడా ఇష్టపడటం లేదు, భయపడుతున్నారు. ఇలాంటి వారి గురించే విదురుడు ఈ సందేశం చెప్పడం జరిగింది.

పత్రి గారు మనకు అందించిన 18 ఆదర్శ సూత్రాలలో మొదటి

సూత్రం సరైన ధ్యానం ఆనాపానసతి అంటే "శ్వాస మీద ధ్యాస ధ్యానం" చెయ్యాలి, అందరి చేత చేయించాలి అని కచ్చితంగా చెప్పారు. 18 ఆదర్శ సూత్రాలు అంటే ప్రతి పిరమిడ్ మాస్టర్ తప్పనిసరిగా పాటించవలసినవి అని తెలుసుకోవాలి.

అలాగే గౌతమ బుద్ధుడు ప్రపంచానికి దుఃఖ నివారణకు తన అష్టాంగ మార్గంలో ఎనిమిదవ అంగంగా సరైన ధ్యానం "ఆనాపానసతి" చెయ్యాలి అని చెప్పిన దానినే పత్రీజీ మొట్టమొదటి పాయింట్ గా తన 18 ఆదర్శ సూత్రాలలో బోధించారు.

అలాగే "జ్ఞాన నవరత్నాలు" లో కూడా "శ్వాసే గురువు" అని చెప్పడం జరిగింది. పత్రి గారు "ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని, "శ్వాసే గురువు" అని, అంటే వేరే గురువు నీకు అవసరం లేదు నీ శ్వాస ని పట్టుకొని ధ్యానం చేసి శక్తిని పెంచుకుని, బుద్ధిని వికసింప చేసుకొని, జ్ఞానం నేర్చుకొంటే మోక్షన్ని పొందుతావని" అని స్పష్టంగా చెప్పడం జరిగింది.

అలాగే భగవద్గీతలో శ్రీకృష్ణులవారు

**శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః. (భ.గీ.4-34)**

తా:- (ఓ అర్జునా) అట్టి జ్ఞానము నీవు తత్వవేత్తలగు జ్ఞానులకు అంటే మోక్షన్ని పొందినవారిని అంటే పరబ్రహ్మాన్ని తెలిసిన వారిని, సాష్టాంగ నమస్కారముచేసి, సమయముచూసి వినయంగా ప్రశ్నించి, సేవచేసి వారివలన తెలుసుకోవాలి.

అప్పుడు వారు తప్పక నీకు ఉపదేశిస్తారు అని స్పష్టంగా చెప్పడం జరిగింది.

పత్రి గారు సుమారు 50,000 పుస్తకాలు చదివి చివరకు వాటన్నిటి సారం "హింసా చోడో - హంసా పకడో" అని అందించారు. అంటే జీవహింస మాను - హంసను అంటే శ్వాసను పట్టుకో! అని చెప్పారు.

ఆయన ఇంకా ఏమన్నారు అంటే "నాకు ఇంగ్లీష్ బాగా వచ్చు, ఫ్లూట్ కూడా బాగా వాయిస్తాను, సంగీతం బాగా పాడగలను, అలానే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం కూడా చెప్పగలను... కానీ వీటన్నింటి లో "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒక్కటే గొప్పది అని తెలుసుకున్నాను, అందుకే దానినే అందరికీ బోధించాను" అని చెప్పారు. పత్రి గారు చెప్పిన ఈ విషయాన్ని వివేకవంతుడు స్పష్టంగా అర్థం చేసుకోగలడు.

ఎందుచేతనంటే? "శ్వాస మీద ధ్యాస" ధ్యానమే సత్యం. ఆ సత్యాన్ని పట్టుకున్న వారే పరబ్రహ్మను ఆశ్రయించినట్టు, వారే మోక్షన్ని పొందగలరు అని ఎవరైతే అర్థం చేసుకుంటారో వారే వివేకవంతులు.

పత్రి గారు 18 ఆదర్శ సూత్రాలలో 14 వ సూత్రంగా "విగ్రహారాధన వద్దు– సత్యారాధనే చేయండి" అని కూడా చెప్పడం జరిగింది. అంటే విగ్రహం అసత్యం కాబట్టి, దాన్ని వదలి ఆత్మను అంటే సత్యాన్ని ఆశ్రయించమన్నారు, అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయమన్నారు.

ఆయన ఇంకా సత్యంలో ఉంటే ఆరోగ్యం, ఆనందం, సంతోషం పొందగలరు, అదే అసత్యంలో ఉంటే దుఃఖము బాధ మిగులుతుంది అన్నారు.

మానవ జన్మ లోనికి ప్రవేశించిన ఆత్మ జన్మ లేని స్థితికి అంటే పూర్ణజ్ఞానం పొందాలి అంటే సుమారు 400 నుంచి 500 జన్మలు పడుతుందని, అందులో ఇప్పుడు ఉన్నది ఒక జన్మ అని పత్రి గారు చెప్పడం జరిగింది.

అందుచేత ప్రతి ఒక్కరూ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తూ జ్ఞానం పెంచుకోవాలే కానీ మూర్ఖంగా వాదించకూడదు, అంతా నాకే తెలుసు అని అనుకోకూడదు.

మూర్ఖుడి యొక్క ప్రవర్తన ఇలా ఉంటుందని విదురుడు ఇచ్చిన సందేశం.

::2::

**"మూర్ఖుడు తన శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించకుండా పగటి కలలు కంటూ ఉంటాడు."**

విదురుడు మూర్ఖత్వపు లక్షణం చాలా అథమ లక్షణం అని చెప్పడం జరిగింది. ఈ ధ్యానమార్గంలోకి వచ్చిన ప్రతిఒక్కరూ వారిలో మూర్ఖపు లక్షణం అనేది ఏది ఉన్న దానిని సరిచేసుకోవాలి అప్పుడే ఈ మార్గంలో తొందరగా ఎదగగలరు.

మన సొసైటిలో తీసుకుంటే చాలా మంది మాస్టర్స్ పుస్తకాల ద్వారా, ఎన్నో సందేశాల ద్వారా కొద్దిపాటి జ్ఞానం తెలుసుకొని దానిని అందరికీ బోధిస్తూ ఉంటారు. వారు చెప్పిన జ్ఞానం విన్నవారు చాలా బాగుంది అని పొగిడినప్పుడు, శాలువాలు కప్పి వారిని సన్మానించినపుడు వారిలో అహంకారం అనేది వచ్చి నాకు అంతా తెలిసిపోయింది ఇక నేను నేర్చుకోవాల్సింది ఏమీ లేదు అనే భావంలో ఉండిపోతారు. ఇలా అహంకారం పెంచుకొని మాయలో పడిపోయిన వారు ఈ మార్గంలో ఎదగలేరు.

పత్రి గారు "ఎంత నేర్చుకున్న ఇంకా నేర్చుకోవాల్సి ఉంటుందనే" ఎప్పుడూ చెప్పేవారు. ఆయన ఎంత తెలుసుకున్నా, ఇంకా కొత్త విషయాలు తెలుసుకోవాలని, కొత్త పుస్తకాలు చదవాలని ఎంతో ఆసక్తి చూపేవారు. కానీ ఇప్పుడు ఎదుగుతున్న మాస్టర్స్ రెండు క్లాస్ లు చెప్పి, రెండు శాలువాలు కప్పించుకొని "మేము జ్ఞానవంతుల అయిపోయాము ఇంక తెలుసుకోవాల్సింది ఏమీ లేదు" అని అనుకోవటం మూర్ఖత్వం.

**"మూర్ఖుడు తన శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించకుండా పగటి కలలు కంటూ ఉంటాడు"** అని విదురుడు చెప్పడం జరిగింది.

మీలో కూడా ఎంతో మంది మాస్టర్స్ గా తయారయ్యారు, జూమ్‌లో క్లాస్ లు చెబుతున్నారు, ఎన్నో చోట్ల వెళ్లి క్లాస్ లు చెబుతున్నారు. అంత మాత్రాన అంతా తెలిసిపోయింది అనే భావంలో ఉండకండి, జ్ఞానం అనేది అనంతం అని తెలుసుకోండి, ఎంత నేర్చుకున్న ఇంకా నేర్చుకోవలసింది ఉంటూనే ఉంటుంది కాబట్టి ఎవరూ పూర్ణ జ్ఞానులు కారు. అందుకే మీరు కూడా మీ శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించుకొని, మీరు క్లాస్ లకు వెళ్లినచోట అక్కడి పరిస్థితులు తగ్గట్టు ప్రవర్తించండి.

::3::

**"అధర్మ మార్గంలో ధనం సంపాదించాలనుకోవటం కూడా మూర్ఖుడి యొక్క లక్షణం" అని విదురుడు చెప్పారు.**

మానవులలో చాలా మంది అధర్మ మార్గంలో ధనం సంపాదించాలని అనుకుంటారు. కారణం ధనం బాగా సంపాదిస్తే చాలా గొప్పగా ఉండొచ్చు అని, సుఖసంతోషాలతో ఉండచ్చు అని, ప్రక్కవాడికంటే గొప్పగా జీవించవచ్చు అని, ఎన్నో భోగాలు పొందవచ్చు అని అనుకుంటూ అధర్మంగా సంపాదిస్తూ ఉంటారు.

వ్యాపారం చేసేవారు ఎన్నో మోసాలు చేస్తూ, ఉద్యోగం చేసేవారు లంచాలు తీసుకుంటూ, రాజకీయాల్లో ఉన్నవారు తప్పుడు వాగ్దానాల ద్వారా ప్రజలను మోసగిస్తూ ఇలా ఎవరి స్థాయిలో వారు అధర్మంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారందరూ మూర్ఖులు అని విదురులవారు చెబుతున్నారు.

అధర్మంగా సంపాదించేటప్పుడు బాగానే ఉండొచ్చు కానీ దాని ఫలితం అనుభవించేటప్పుడు వారి పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది. తాత్కాలికంగా లాభం పొందొచ్చు కానీ వారి భవిష్యత్ జీవితం అంధకారంగా మారుతుంది. ప్రస్తుత సమాజంలో ఇలాంటి పరిస్థితులు అనుభవించేవారిని మనం గమనిస్తున్నాము.

ధర్మంగా ఉండాలి, ధర్మంగా జీవించాలి, సత్యంలో జీవించాలి అని ఈ ధ్యానమార్గంలోకి వచ్చిన మీరు అందరికీ బోధించటం వలన ప్రయోజనం లేదు, ముందు మీరు ఆచరణలో పెట్టుకోవాలి. ఈ మార్గంలోకి వచ్చిన మీకు ఆత్మే భగవంతుడు అని, ఆ భగవంతుడు మీ శరీరంలోనే ఉన్నాడని, మీరు మాట్లాడే మాటలు, మీరు చేసే పనులు ఆయన గమనిస్తూ ఉంటాడని తెలుసుకోవాలి.

మీరు అధర్మంగా ప్రవర్తిస్తూ ఉంటే మీలో ఆత్మఘోష పెరిగిపోతూ

ఉంటుంది. ధ్యానం  చేసే వారికి ఈ ఆత్మఘోష అనేది స్పష్టంగా అర్థమవుతుంది.

వివేకవంతుడు ఎప్పుడు న్యాయంగా, ధర్మంగా జీవిస్తూ ఉంటాడు. కారణం **"సంపాదించడం గొప్ప కాదు, ఏ విధంగా సంపాదిస్తున్నాను అన్నదే ముఖ్యం"** అని తెలుసుకున్నవాడు. అధర్మ సంపాదన వల్ల మరు జన్మలో ఆ పాప ఫలితం అనుభవించాలి, అంటే మరుజన్మలో ఎంతో నరకాన్ని అనుభవిస్తారు. అందుకే పత్రి గారు "నువ్వు ఈ జన్మలో అనుభవించేది అంతా నువ్వు గత జన్మలో చేసిన కర్మ ఫలితమే" అని చెప్పటం జరిగింది.

కొంతమంది కష్టాలు అనుభవించలేక చనిపోదాం అని అనుకునే వారు, భార్యభర్తలు గొడవలు పడేవారు, కొంతమంది ఆర్థిక ఇబ్బందులు పడేవారు, కొంతమంది అనారోగ్యంగా జీవించేవారు ఇలా రకరకాల బాధలు పడుతుంటారు కానీ ఈ బాధలు వారికి ఎందుకు వచ్చాయో? అని విచారణ చేసుకోవాలి.

అందుకే విదురుడు **"నీ మూర్ఖ లక్షణం వల్ల ఈ జన్మలో అధర్మంగా జీవిస్తే ఇప్పుడు నీ జీవితం ఆనందంగా ఉండొచ్చు కానీ మరు జన్మలో దుర్భరమైన జీవితం అనుభవించాల్సి వస్తుంది"** అని చెప్పడం జరిగింది

చాలా మంది మాకు ధ్యానం చేయడానికి సమయం లేదు వ్యాపారమో, ఉద్యోగమో చేయడంతోటే సరిపోతుంది అని, సంపాదన మీదే దృష్టి పెడతారు, కానీ వారి ఆత్మకు లాభం కలిగే పనులు చెయ్యరు. మరి భార్య/ భర్త, పిల్లలు అని వారి గురించి ఆలోచించి కర్మలను మూటగట్టుకుంటే అనుభవించాల్సిందే మీరే అని తెలుసుకోలేకపోతున్నారు. అందుకే పత్రి గారు కూడా "నీ వాస్తవానికి నీవే కారణం" అని చెప్పడం జరిగింది.

అందుకే విదురుడు కూడా "మూర్ఖంగా ప్రవర్తించకు, నీవు చేసిన కర్మలను నువ్వు అనుభవించవలసిందే! కానీ భార్య/ భర్త, పిల్లలు అనుభవించరు. అందుచేత వారి కోసం నువ్వు అధర్మంగా సంపాదించి కర్మలు మూట

కట్టుకోవద్దు, మూర్ఖుడిగా ప్రవర్తించవద్దు" అని చెబుతున్నారు.

విదురుడు చెప్పిన ఈ సందేశంలో ఎంతో అర్థం ఉంది. కాబట్టి మూర్ఖుడిలా కాకుండా వివేకవంతుడిగా ప్రవర్తించాలి. అధర్మంగా సంపాదించిన ఆహారం కాని, హింసతో కూడిన పంచభక్ష పరమాన్నాలు కాని నీ శరీరంలోకి వెళ్ళిన తర్వాత అది విషతుల్యం అవుతాయి. కానీ ధర్మంగా సంపాదించి నీవు తీసుకునే ఆహారం మజ్జిగ మెతుకులు అయినా నీ శరీరంలోకి వెళ్లిన తర్వాత అది అమృతతుల్యం అవుతుందని తెలుసుకోవాలి.

మూర్ఖత్వంలో ఉన్నవారు తమోగుణంలో ఉంటారు కాబట్టి ముందు తమోగుణం నుండి బయట పడాలి. అంటే తీవ్రంగా కొన్ని నెలలు ధ్యాన సాధన చేసి శక్తిని పెంచుకుంటే మీ గుణం మారి బుద్ధి వికసిస్తుంది. అప్పుడు నీవు మూర్ఖత్వం నుండి బయటపడి వివేకత్వంలోనికి వస్తావు, వివేకత్వంలోనికి రావడం అంటే సాత్విక గుణం లోకి రావడం.

హింస కానీ, పాపం కానీ చేస్తే వాటి ఫలితం వెంటనే కనపడదు. ఆ పాపం పండినప్పుడు కష్టాలు, బాధల రూపంలో మిమ్మల్ని బాధిస్తాయి. అందుకే మీరు చేసే ప్రతి కర్మ ఆకాశిక్ రికార్డుల్లో రికార్డు అవుతుంది కాబట్టి, ప్రతి కర్మ అనుభవించవలసి వస్తుందని గమనించుకోండి.

అందుకే మీరు ధర్మంగా జీవిస్తూ తప్పులు, పాపాలు ఏమైనా చేస్తున్నామా? అని ఎప్పటికప్పుడు గమనించుకుంటూ మూర్ఖత్వం బయటపడి వివేకత్వంలోకి రండి.

::4::

**"మూర్ఖుడు తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యాలను నిర్వర్తించడు కానీ ఎదుటివారు మాత్రం నిర్వర్తించాలి అని అంటాడు, లేకపోతే నిందిస్తాడు."**

రామకృష్ణ మిషన్ వారు **"ఆత్మనో మోక్షయచ జగత్ విధాయచ"** అనే సందేశం ఇచ్చారు. ఈ సందేశం బట్టి మానవుని మొదటి కర్తవ్యం మోక్షాన్ని పొందటం. కానీ ప్రస్తుతం మానవులంతా వారి కర్తవ్యాన్ని మర్చిపోయి ఈ సృష్టిలో ఉన్న వాటి గురించే ఆలోచిస్తున్నారు కానీ ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త గురించి తెలుసుకోవాలనే అవగాహన ఉండటం లేదు.

మానవ జన్మ యొక్క పరమార్థం ఆ పరబ్రహ్మ గురించి తెలుసు కోవడమే. అది మర్చిపోయి ప్రాపంచిక కోరికల వెంట, బంధాల వెంట పడుతున్నారు. శంకరాచార్యుల వారు కూడా భజగోవిందంలో నీ తల్లి ఎవరు? నీ తండ్రి ఎవరు? అని విచారణ చేసుకో అని చెప్పారు. రమణ మహర్షి వారు కూడా ఈ సృష్టి వెనకాల పడటం కాదు ముందు నీవెవరో? తెలుసుకో అని చెప్పడం జరిగింది.

మీరందరూ కూడా మీ సంసార బాధ్యతలు నిర్వర్తించుకుంటూ మీరెవరో? ఈ భూమ్మీదకి ఎందుకు వచ్చారో? అని విచారణ చేసుకోవాలి అదే మీ మొదటి కర్తవ్యం. ఇంకా బాధ్యతలు, మమకారాలు అంటూ కూర్చుంటే మీరు ఎప్పటికి మోక్షన్ని పొందలేరు.

బంధువులు ఫంక్షన్స్‌కి, పార్టీస్ కి పిలిస్తే వెళ్ళకపోతే ఏమైనా అనుకుంటారేమో అని మీరు వాటికి హాజరైతే మీ సమయం వృధా అవటమే కాక ప్రాపంచిక వ్యవహారాలలో పడి మీరు మీ శక్తిని కోల్పోతారు. ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన మీరు మీ సమయాన్ని ధ్యానం చేయడానికి, జ్ఞానం పొందటానికి వినియోగించుకోవాలి. అలా కాకుండా మీ కర్తవ్యాన్ని నిర్వర్తించ కుండా, మీరు చేయాల్సిన పనులు చేయకుండా ఉంటే మీలో మూర్ఖత్వపు లక్షణం ఉన్నట్లే.

ఆత్మలైన మీరు మీ కర్తవ్యాల మీద దృష్టి పెట్టి మీ ఆత్మ ఉన్నతికి పాటుపడండి. పత్రి గారూ కూడా "ఇతరులు ఏమనుకుంటే నీకెందుకయ్యా? నీవు చేయవలసినపని చేస్తున్నావా? లేదా? అనేదే ముఖ్యం" అని చెప్పారు. కనుక మీరందరూ మూర్ఖుడిలా సమయాన్ని వృధా చేసుకోకుండా వివేకంతో మీ సమయాన్ని సాధనకు ఉపయోగించుకోండి.

## ::5::

**"కోపము, అసూయ లాంటివి తననే దహించి వేస్తాయనే వివేకం లేకుండా మాటి మాటికీ వాటిని ప్రదర్శించేవాడు మూర్ఖుడు." అని విదురుడు చెప్పటం జరిగింది.**

మీలో చాలా మందికి విదురుడు చెప్పిన ఈ విషయం మీద అవగాహన లేక ఇతరుల మీద ఆధిపత్యం చెలాయించాలి, మీ మాటే చెల్లాలి అని వారి మీద కోపాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు.

మీరు గమనిస్తే చాలా మంది భర్తలు వారి భార్యలను కోపగించుకుంటూ ఉంటారు అలానే ఇంకా కొంతమంది పనివాళ్లను, ఆఫీసర్స్ అయితే క్రింది ఉద్యోగులను కోపగించుకుంటూ ఉంటారు, వారి యొక్క ఆధిపత్యాన్ని చూపించాలని అలా కోపగించుకుంటూ ఉంటారు.

కాని ఈ మార్గంలోనికి వచ్చిన మీరు గ్రహించవలసినది ఏమిటంటే ఇతరుల మీద కోపాన్ని ప్రదర్శించటం వలన కర్మలను పోగేసుకుంటారు, వాటి ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది, ఎంతో బాధని పొందాల్సి వస్తుంది. అంతేకాదు జీవితం దుర్భరంగా తయారవుతుంది, చివరకు ఎందుకు ఇలా చేశానని పశ్చాత్తాప పడతారు.

ఒక సద్గురువు యొక్క కోపం శిష్యుని ఎదుగుదల కోసమే కానీ, గురువుకి శిష్యుడు మీద ఎటువంటి ద్వేషం ఉండదు. పత్రి గారు కూడా అహంకారికి ఆత్మ జ్ఞానం అబ్బదు అని చెప్పారు.

నేను కూడా మీలో అహంకారాన్ని పోగొట్టడానికే గట్టిగా చెప్పడం జరుగుతుంది, అది మీ ఎదుగుదల కోసమే! గురువు యొక్క కోపం తన ఎదుగుదల కోసమే అని అర్థం చేసుకున్న శిష్యుడు జ్ఞాని అవుతాడు లేకుంటే అజ్ఞానిగా మిగిలిపోయి దుఖంలో కూరుకుపోతాడు.

కాబట్టి మీరందరూ కూడా జ్ఞానవంతులు అవ్వాలి. అంటే తీవ్ర ద్వారా సాధన చేసి, మలినమైన మనసును శుద్ధి చేసుకొని, మీ శక్తిని పెంచుకుని, గుణాన్ని మార్చుకొని, మీ బుద్ధిని వికసింప చేసుకుంటే... ఆత్మ యొక్క ప్రాముఖ్యం పెరిగి అంతరాత్మ సందేశాలు మీకు అందుతాయి, మీరు జీవితంలో

ఏ తప్పు చేసినా మీ అంతరాత్మ హెచ్చరిస్తూనే ఉంటుంది. మనసు మలినంగా ఉన్నవారు ఇది గ్రహించలేరు. అందుకే కఠినమైన ఆహార నియమాలు పాటిస్తూ, తీవ్ర ధ్యాన సాధన ద్వారా మీ మనసును ఎప్పుడు శుద్ధ సత్వంలో ఉంచుకోవాలి, అప్పుడు మీరు మీ జీవితంలో ఎటువంటి తప్పులు చేయరు, మీ భవిష్యత్తు ఎంతో ఆనందంగా ఉంటుంది.

కుటుంబంలో భార్య, భర్తలు ఇద్దరు ధ్యానం చేస్తే ఆ సంసారం స్వర్గం అవుతుందని పత్రి గారు చెప్పారు. కానీ భార్య భర్తలు ఇద్దరూ జ్ఞానులు కాకపోతే ఆ సంసారంలో రోజు గొడవలు పడుతూ ఇద్దరు మూర్ఖులుగానే ప్రవర్తిస్తుంటారు.

**అసూయ:** సహజంగా ఈ గుణం ఆడవారిలో ఎక్కువగా కనపడుతుంది. తోటివారు మంచి చీర కట్టుకున్నా, మంచి నగలు ధరించినా, వారి భర్తలు బాగా చూసుకుంటున్నా ఎక్కువ అసూయపడుతుంటారు. కొంతమంది మగవారిలో కూడా వారికన్నా ఎక్కువ స్థాయిలో ఉన్నవారిని, వారికన్నా ఎక్కువ ఎదుగుతున్న వారిని చూసి అసూయపడుతుంటారు, మన సొసైటీలో కూడా ఇలాంటి వారున్నారు.

ఇది కూడా మూర్ఖుడి యొక్క లక్షణం. ఈ సాధనా మార్గంలోకి వచ్చినా కూడా అసూయతో ప్రవర్తిస్తే కచ్చితంగా సరిచేసుకోవాలి లేకుంటే ఎదగలేరు.

ఈ సృష్టిలో ప్రతికర్మ ఆకాశిక్ రికార్డులలో రికార్డ్ అవుతూ ఉంటుంది అని మనకు తెలుసు. అందుకే ఎప్పటికప్పుడు మీ ప్రవర్తన గమనించుకుంటూ ఉండాలి. విదురుడు కూడా అదే చెబుతున్నారు. కోపం, అసూయ అనే లక్షణాలు మీలో ఉంటే వాటి వల్ల నష్టపోయేది మీరేనని తెలుసుకోవాలి.

కాబట్టి జ్ఞానం సంపాదించుకునే మీరు కూడా గొప్ప మాస్టర్స్ గా ఎదగాలి, అలాంటి వారికి ప్రకృతి ఎప్పుడూ సహకరిస్తుంది. అందుచేత దేహ భ్రాంతిని వదలి ఆత్మ భ్రాంతిలో ఉంటే ఎప్పుడు మీకు దుఃఖం ఉండదు.

అందుకే మీరందరూ కోపం, అసూయ అనే మూర్ఖత్వపు లక్షణాలు వదలి వివేకవంతులు కావాలి

::6::

**“మూర్ఖుడు వంటి నిండా, నోటినిండా, చేతినిండా గర్వం నిండినవాడు.”**

విదురుడు ఈ సందేశం ద్వారా మూర్ఖుడు ఎలా ప్రవర్తిస్తాడో మనకి వివరిస్తున్నారు. మూర్ఖుడు తన శరీరంతో చేసే పనులలో, నోటితో మాట్లాడే మాటలలో, చేతులతో చేసే పనులలో అహంకారాన్ని, గర్వాన్ని చూపిస్తూ ఉంటాడు. వాడు చేసే పనులు ఇంకెవరూ చేయలేరని, వాడు మాట్లాడినట్టు ఇంక ఎవరూ మాట్లాడలేరు అని భావిస్తుంటాడు. అటువంటి ప్రవర్తన వాడికే కష్టాలు తెచ్చిపెడుతుందని మూర్ఖుడు తెలుసుకోలేడు. కాని కాస్త వివేకంతో, బుద్ధితో ఆలోచించే వారికి ఇది తప్పు అని గ్రహించగలుగుతారు.

మన పురాణాల్లో తీసుకుంటే రాక్షసులకు, దేవతలకు మధ్య జరిగిన యుద్ధంలో దేవతలు విజయాన్ని పొందారు. ఆ గెలుపును చూసుకుని వారిలో ఎంతో గర్వం, అహంకారం పెరిగిపోయింది. ఎంతో వినయంతో ఉండవలసిన దేవతలు అహంకారంతో విర్ర వీగడం గమనించిన ఆ పర బ్రహ్మ యక్షని రూపంలో వచ్చి వారికి బుద్ధి చెప్పటం, వారిలోని అహంకారాన్ని తొలగించడం జరిగింది.

బాహ్యంగా ఉండే శరీరాన్ని చూసుకొని “నేను నాది” అనే అహంకారాన్ని పెంచుకోకూడదు. ఆత్మ అంటే ఆ పర బ్రహ్మ మీనుండి తప్పుకుంటే చిటికెన వేలు కూడా కదిలించలేరు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొని ప్రతిఒక్కరూ మీలో అహంకారాన్ని తొలగించుకునే ప్రయత్నం చేయాలి.

కొంతమంది పుట్టినరోజును ఎంతో సంబరంగా చేసుకుంటూ ఉంటారు. కానీ మీ జీవితంలో ఒక సంవత్సరం తగ్గిపోయిందని, ఒక సంవత్సరం చావుకి దగ్గర అయ్యారు అని తెలుసుకోండి.

ఆత్మ అయిన మీరు వయసు పెరిగే కొద్ది సాధన, జ్ఞానం మీద శ్రద్ధ

పెట్టి ఆత్మ ఎదుగుదలకు కృషిచేయాలి. మీ సమయాన్ని దుర్వినియోగం, నిర్వినియోగం చేసుకోకుండా జ్ఞానం పొందటానికి ప్రయత్నించండి.

తమోగుణం మూర్ఖత్వానికి కారణం కాబట్టి ప్రతిఒక్కరూ "శ్వాస మీద ధ్యాస" పెట్టి తీవ్ర ధ్యాన సాధన చేస్తూ, సాత్వికమైన ఆహారం తీసుకుంటూ తమోగుణం నుండి మూర్ఖత్వం నుండి బయటపడాలి.

ఈ మార్గంలోనికి వచ్చి కూడా ఇంకా భార్య/భర్త, పిల్లలు అనుకుంటూ బంధాలలో ఉండిపోయి సాధనను ప్రక్కన పెడితే ఇంకా ఎన్నో జన్మలు తీసుకోవాల్సి వస్తోంది. జన్మ అంటే సామాన్యమైన విషయం కాదు, ఎన్నో బాధలు, కష్టాలు, దుఃఖంతో కూడి ఉంటుంది, కాబట్టి ప్రాపంచిక కోరికలతో మీ ఇష్టానుసారం జీవిస్తే జన్మలు పెరగక తప్పవు.

భగవద్గీతలో కూడా శ్రీకృష్ణులవారు అర్జునుడికి గీతోపదేశం చేసిన తర్వాత "అర్జునా! నేను బోధించవలసినది అంతా బోధించాను, ఇక నీ ఇష్టం నీ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తావా? లేక బంధాలతో ఉండిపోతావా? అని శ్రీకృష్ణులవారు అర్జునుడికి చెప్పడం జరిగింది.

అలాగే పత్రి గారు కూడా బోధించవలసిన జ్ఞానం మనకు బోధించారు. కాబట్టి మీరందరూ కూడా జ్ఞానం పొంది, తెలుసుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టుకుని, ఈ మార్గంలో ఎదగాలి. మీ అందరికీ కూడా మీ ఇష్టం వచ్చినట్టు జీవించే హక్కు ఉంది, కానీ ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించాలి. అలా కాకుండా మీ ఇష్టం వచ్చినట్లు జీవిస్తే మీ జీవితంలో కష్టాలు, బాధలు, దుఃఖం తప్పవు.

అందుకే మీరందరూ కూడా మూర్ఖత్వం, మూఢత్వం నుండి బయటకు రావాలి, వివేకంలో జీవించగలగాలి. అప్పుడే మీలో జ్ఞానం పెరిగి మీరందరూ కూడా బయటకు వెళ్ళి ఎన్నో క్లాస్ లు చెప్పగలుగుతారు. అందుకే ప్రతిఒక్కరిని భీమవరం రండి అని చెబుతూ ఉంటాను. భీమవరంలో జరిగే

ధ్యాన యజ్ఞానికి మీరు హాజరైతే అక్కడ మీరు గంటలు గంటలు ధ్యానం చేయడం వలన మీలో తమోగుణ లక్షణాలు పోయి సాత్విక గుణంలోకి వస్తారు అంటే మూర్ఖత్వం,మూఢత్వం, నుండి వివేకత్వంలోకి రాగలుగుతారు.

జ్ఞాని ఎప్పుడు కూడా సమస్థితిలోనే ఉంటాడు. గెలుపు ఓటములను, మాన అవమానాలను రెండు సమానంగానే స్వీకరించగలుగుతాడు. జ్ఞానికి తాను శరీరం కాదు, ఆత్మ అని తెలుసు. గర్వం, అహంకారం అనేది శరీరానికే కానీ ఆత్మకు కాదు. తమోగుణంలో ఉన్నవారు మూర్ఖుడిలా ప్రవర్తిస్తుంటారు కాబట్టి ఈ మార్గంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ తీవ్ర ధ్యాన సాధన ద్వారా తమోగుణం నుండి, మూర్ఖత్వపు లక్షణాల నుండి బయటపడాలి.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

::7::

**“మూర్ఖుడు తనను అభిమానించే వారిని దూరం చేసుకుంటాడు. తనను అసహ్యించుకునే వారిని దగ్గర చేసుకుంటాడు.”**

మూర్ఖుడు తనని గౌరవించే వారిని, తనని అభిమానించే వారిని దూరం చేసుకుంటాడు. ప్రస్తుతం మన సమాజంలో మన చుట్టూ ఉండే వారిని గమనిస్తే ఈ విషయం మనకు అర్థం అవుతుంది. ఇప్పటి వివాహ వ్యవస్థను గమనిస్తే... పెద్దవారు పిల్లల మంచి చెడ్డలు చూసి ఒక అమ్మాయికి, ఒక అబ్బాయికి పెళ్లి చేస్తారు. వారిరువురూ కలకాలం అన్యోన్యంగా జీవించాలి అని ఎంతో కష్టపడి, ఎంతో ధనం ఖర్చు పెట్టి ఘనంగా పెళ్ళి చేస్తారు. వారిరువురు కూడా పెళ్ళి అయిన కొత్తలో కొంతకాలం ఒకరి మీద ఒకరు ఎంతో ప్రేమతో ఉంటారు. కానీ కొంతకాలం గడిచాక ఆ భర్తకి భార్య నచ్చకపోవడం, భార్యకి భర్త నచ్చకపోవడం చివరకు ఇద్దరూ విడిపోవాలని కోర్ట్ కి వెళ్ళడం జరుగుతుంది.

భార్య వల్ల భర్తకు, భర్త వల్ల భార్యకు ఎటువంటి బాధలు లేకుండా సుఖ సంతోషాలతో జీవించాలని పెళ్ళి చేసుకుంటారు. కానీ కొన్ని రోజులు గడిచాక ఆ భర్త పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్టుగా తయారవుతాడు. అంటే వాడి ఇంట్లో కమ్మటి కూర నచ్చక పక్కింట్లో ఉన్న పుల్లకూర కావాలి అన్నట్టుగా ఎంతో ప్రేమించే భార్యను ప్రక్కనబెట్టి వేరే ఆడ వారి వెంట పడతాడు.

పెద్దలు ఊరికే చెప్పలేదు మనకి దూరపు కొండలు నునుపు అని. ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకొని వారు ఆ సామెతని చెప్పారు. దూరంగా ఉండే కొండ నునుపు గానే కనిపిస్తుంది. కానీ దాని దగ్గరకు వెళ్తే రాళ్ళతో ఎగుడుదిగుడుగా కనిపిస్తుంది. అలాగే ఎంతో ప్రేమించే భార్య ఇంట్లో ఉన్నప్పుడు వేరే ఆడ వారి వెంటపడటం మూర్ఖుడి యొక్క లక్షణం.

అలాగే కొంత మంది భార్యలు కూడా ఎంతో అభిమానించే, ప్రేమించే భర్త ఉన్నా కూడా ఆ భర్త యొక్క స్తోమతను గమనించుకోకుండా ఎన్నో కోరికలు కోరుతుంటారు. బంగారం కావాలని, కారు కావాలని ఇలాంటి కోరికలతో భర్తను ఇబ్బంది పెడుతూ ఉంటారు. ఆ కోరికలు తీర్చలేదని భర్తను

దూరం చేసుకుంటారు. ఇది కూడా మూర్ఖుల యొక్క లక్షణంగా చెప్పుకోవచ్చు.

ఎందుకంటే ఇప్పటి జనరేషన్ పిల్లలకు ఎడ్జెస్ట్‌మెంట్ అనేది ఉండటం లేదు. భార్య ఎంత బాగా చూసుకున్నా కొంతకాలం గడిచాక ఆమె మీద మోజు తగ్గి, వేరే ఆడవారి వెంట పడటం, అలాగే భర్త ఎంత బాగా చూసుకున్నా ఆమె కోరినవి అన్ని సమకూర్చినా ఇంకా అసంతృప్తితోనే ఉండటం, ఇలా ఒకరి మీద ఒకరికి అభిమానం, ప్రేమ అనేవి లేకుండా పోతున్నాయి.

ఇలాంటి వారు అందరూ మూర్ఖులు అని చెప్పవచ్చు. వారిరువురూ కాస్త వివేకంతో ఆలోచించి ఒకరినొకరు అర్థం చేసుకుని జీవిస్తే వారు ఎంతో ఆనందంగా, అన్యోన్యంగా ఉంటారు. అందుకే పత్రి గారు "భార్యాభర్తలిద్దరూ ధ్యానులు అయితే వారి సంసారం స్వర్గం అవుతుంది" అని చెప్పారు.

ఆ రకమైన ప్రవర్తన మీలో కూడా ఉంటే మీరు జీవితంలో ఎంతో నష్టపోతారు. అందుచేత ఈ రకమైన ప్రవర్తన నుంచి బయటపడాలి. ఇటువంటి ప్రవర్తన తమోగుణంలో, రజోగుణంలో ఉన్న వారికి ఎక్కువగా ఉంటుంది కాబట్టి తమోగుణం నుండి రజోగుణం నుండి బయట పడటానికి ప్రయత్నించాలి.

మీ చేత తప్పులు చేయించే గుణం తమోగుణం అని తెలుసు కున్నప్పుడు, మీరు సాధన తీవ్రంగా చేసి ఆ తమోగుణం నుండి బయట పడతారు. అప్పుడే మీరు సరైన నిర్ణయాలు తీసుకోగలరు, సరైన ఆలోచనలు ఆలోచిస్తారు మీకు నష్టం కలిగించే పనులు చేయకుండా కష్టాలు, బాధల నుండి బయట పడతారు.

విచిత్రం ఏమిటంటే మూర్ఖుడు నేను చేసేవన్నీ కరెక్ట అని అనుకుంటాడు, కానీ వాడు చేసే పనులు అన్నీ సృష్టికి విరుద్ధంగా ఉంటాయి. అందుచేత దుఃఖం రూపంలో దాని ఫలితాన్ని అనుభవిస్తాడు. మీరు ఈ విషయాలన్ని తెలుసుకొని ఇంకా మీలో మార్చుకోవాల్సిన లక్షణాలు ఉంటే మార్చుకొని తీవ్ర సాధన చేస్తూ ఈ మార్గంలో పురోగతి సాధించాలి.

ప్రతిఒక్కరూ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా ఈ మూర్ఖత్వం లక్షణాలను తొలగించుకోవాలి.

::8::

**“మూర్ఖుడు తన మేలు కోరి లోపాలు చెప్పిన వారిని దూరం చేసుకుంటాడు. అంతే కాదు తన బాగు కోసం కాకుండా భజన చేసే వారిని దగ్గర చేసుకుంటాడు”.**

సహజంగా ఎవరైనా తన దగ్గరి వారు కానీ, తన ఆప్తులు కానీ, తన స్నేహితులు కానీ ఎవరైనా తప్పులు చేస్తున్నా, వారిలో లోపాలు ఉన్నా, వారు నష్టపోతారు, కష్టాల పాలవుతారని వారి క్షేమం కోరి వారిలోని లోపాలను తప్పులను చెప్పే ప్రయత్నం చేస్తారు.

కానీ లోకంలో ఎవరైనా తనను పొగిడితే సహించగలరు కానీ విమర్శించినా, లోపాలు చెప్పినా సహించలేరు. కారణం మూర్ఖుడికి అహంకారం ఎక్కువ. నాకే అన్ని తెలుసు, నేను చేసేదే కరెక్టు అనే అభిప్రాయం తో ఉంటాడు. అందుకే మూర్ఖుడికి తన లోపాలు చెప్తే సహించలేడు.

“నీ పని నువ్వు చేసుకో, నా గొడవ నీకెందుకు? నేను ఏం చేయాలో? నాకు తెలుసు, నువ్వు నాకు చెప్పక్కర్లేదు?” అనే సమాధానం ఇస్తాడు. కానీ వాడి మంచి కోసమే, వాడు నాశనం అయిపోతున్నాడు అనే తపనతో, ఆందోళనతో వారు చెబుతున్నారు అని అర్థం చేసుకోలేడు. అలా వారు పదే పదే చెబితే వారిని శత్రువులా చూస్తాడు, వారితో గొడవ పెట్టుకొని వారిని దూరం చేసుకుంటాడు.

విదురుడు చెప్పినట్లు ఇటువంటి సంఘటనలు భార్య భర్తల మధ్య కూడా ఉంటాయి. భార్యలో ఉన్న లోపాలు భర్త చెబితే భార్యకు కోపం, భర్తలో ఉన్న లోపాలు భార్య చెబితే భర్తకు కోపం ఇలా వారి సంసారంలో ఎన్నో గొడవలు అవుతూ ఉంటాయి.

ఎందుకు ఇలా ప్రవర్తిస్తూ ఉంటారు అంటే తన మంచి కోసం చెప్పినా కూడా అర్థం చేసుకోకుండా గొడవలు పడుతూ ఉంటారు, కారణం

వారిలో ఉన్న మూర్ఖత్వం వలన. కానీ కాస్త వివేకంతో ఆలోచిస్తే ఎదుటివారు చెప్పింది కూడా మన మంచికే కదా! అని అర్థం అవుతుంది. అందుకే మూర్ఖుడిలా కాకుండా వివేకవంతుడుగా ఆలోచించాలి.

మూర్ఖుడు అంటే తమోగుణంలో ఉన్న వాళ్ళు. ఇటువంటి మూర్ఖులు చాలా సంసారాల్లో ఉన్నారు. అందుకే చాలా మంది భార్య భర్తలు ఒకరికొకరు దూరమవుతున్నారు. అందుకే ప్రతిఒక్కరూ మూర్ఖత్వం నుండి బయటపడాలి అంటే తమోగుణం నుండి బయట పడాలి.

తమోగుణం నుంచి బయటపడాలి అంటే ముఖ్యంగా రెండు పనులు చేయాలి. ఒకటి పత్రి గారు మనకు అందించిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేయాలి, రెండు సాత్వికమైన శాఖాహారం తీసుకోవాలి. ఇలా కొన్ని నెలల పాటు కచ్చితంగా పాటించినప్పుడు వారిలో తప్పకుండా మార్పులు వస్తాయి. వారిలో ఉన్న మూర్ఖత్వపు లక్షణాలు పోగొట్టుకోగలరు.

వివేకవంతులు తమలోని లోపాలు చెప్పినా, వారిని ఆప్తులుగానే భావిస్తారు. "వారు నా మంచి కోసమే కదా! నా క్షేమం కోసమే కదా! వారు చెప్పేది" అని వారిని వ్యతిరేక భావంతో చూడకుండా అర్థం చేసుకుంటారు.

మన సొసైటీలో పత్రి గారు ఏం చేసినా అందరి మేలు కోసమే చేస్తూ ఉంటారు. సందర్భాన్ని బట్టి మనలో ఉన్న అహంకారం, గర్వం, మూర్ఖత్వాన్ని తొలగించడానికి ఒక్కొక్కసారి కఠినంగా కూడా వ్యవహరించేవారు. అటువంటప్పుడు కొంతమంది "ఈయన ఏమిటి ఇలా తిడతాడు, ఇలా అందరినీ కోపగించుకుంటాడు అని ఆయనకు దూరమైన వారు చాలా మంది ఉన్నారు. పత్రి గారు గురువుగా దొరకటమే మన జన్మ జన్మల సుకృతం. అటువంటిది వారి మూర్ఖత్వంతో ఆయనను దూరం చేసుకోవడం అనేది వారి యొక్క అవివేకమే.

ఆ విషయమే మనకు విదురుడు చెబుతున్నాడు. తన మేలు కోరి

లోపాలు చెప్పేవారిని మూర్ఖుడు దూరం చేసుకుంటాడు అంతేకాదు తన బాగు కోసం కాకుండా భజనలు చేసే వారిని దగ్గర చేసుకుంటాడు అని.

నా జీవితంలో కూడా పత్రి గారి తో ఎన్నో సందర్భాల్లో తిట్లు తినటం జరిగింది. ఆయన నన్ను ఎన్నో సార్లు డిస్కరేజ్ చేయడం, కొట్టడం కూడా చేశారు. కానీ నేను అహంకారంతో మూర్ఖుడిగా ప్రవర్తించి ఉంటే నేను కూడా పత్రి గారికి దూరం అయ్యేవాడినేమో! కానీ వివేకంతో ఆలోచించి ఆయన చేసేది, చెప్పేది అంతా నా మంచి కోసమే కదా? ఆయన శత్రువు కాదు కదా? అనే భావంతో ఉండే వాడిని.

అలా వివేకంతో ఆలోచించబట్టే నేను కానీ, అమ్మ కాని ఆయన దగ్గర ఎంతో జ్ఞానాన్ని పొంది ఈ స్థాయిలో ఉన్నాము. సద్గురువులు ఎప్పుడు కూడా మన ఉన్నతిని కోరుకుంటారు. అందుకే మీరందరూ కూడా నాలా తయారవ్వాలని నా కోరిక.

పత్రి గారు తిట్టినా, కొట్టినా ఇలా ఎందుకు కొడుతున్నాడు అని చెప్పి అనుకునేవాడిని కాదు, నాలో  ఏదో లోపం ఉంది అని ఆలోచించి వెంటనే దాన్ని సరిచేసుకునేవాడిని, ఆయన పట్ల ఎప్పుడు కృతజ్ఞత భావంతోనే ఉండే వాడిని. పత్రి గారు కోపంతో ఉన్నప్పుడు ఎంతో ఉగ్రరూపంతో ఉండేవారు, మరుక్షణమే ఎంతో సౌమ్యంగా మాట్లాడేవారు.

పత్రిగారితో నాకు ఎన్నో అనుభవాలున్నాయి. ఒకసారి షిరిడిలో యజ్ఞం జరిగేటప్పుడు అక్కడకు రెండు రోజులు లేట్ గా వెళ్ళాను. ఆ రోజు ఆ యజ్ఞంలో పత్రిగారి ఎదురుగానే కూర్చొని ధ్యానం చేశాను ఆ ధ్యానం అయిపోయాక పత్రి గారు స్టేజీ దిగి వచ్చాక ఆయనను పలకరిద్దామని ఎదురు వెళ్ళాను. అప్పుడు ఆయన చాచి పెట్టి నా చెంపపై కొట్టారు. అప్పుడు నాకు ఏమీ అర్థం కాలేదు, ఆశ్చర్యం వేసింది. ఎందుకు ఇలా కొట్టాడు, నేనేమీ తప్పు చేయలేదు కదా? అని అనుకున్నాను, కానీ నేను ఏమీ రియాక్ట్ అవ్వలేదు.

పత్రి గారు కొట్టారు అంటే ఏదో కారణం ఉంటుంది అని అనుకుని మౌనంగా ఉండి పోయాను.

ఆ తర్వాత పత్రి గారి దగ్గరికి నేను వెళ్తే ఆ స్టేజ్ దగ్గర ఉన్న ఉగ్రరూపం అప్పుడు లేదు. అప్పుడు అయినా నన్ను పిలిచి ఆయన ప్రక్కన కూర్చోబెట్టుకొని టిఫిన్ పెట్టించారు. అప్పుడు నాకేమీ అర్థం కాలేదు ఎందుకు ఇలా చేశారని. కాస్త ఆలోచిస్తే నాకు అర్థమైంది ఏమిటంటే అంత గొప్ప యజ్ఞం ఆయన నిర్వహిస్తూ ఉంటే ఇంత సీనియర్ మాస్టర్ అయిన నేను దానికి సహకరించక, దానికి కావలసిన కృషి చేయకుండా, అది సక్సెస్ అవ్వడానికి ప్రయత్నం చేయకుండా తీరుబడిగా ఏమీ చేయకుండా మూడో రోజు ఎప్పుడో వస్తే కోపం రాదా?

అప్పటి నుండి ప్రతి యజ్ఞంలో కూడా ఎంతో సహకారాన్ని అందించాను. వైజాగ్ యజ్ఞంలో నేను చేసిన కృషికి లాస్ వస్తుంది అనుకున్నది ప్రాఫిట్ వచ్చింది.

అలాగే మన పి.ఎం.సి సాటిలైట్ ఛానల్ కోసం ఎన్నో కోట్లు ఖర్చు అవుతున్నాయి అంటే అప్పుడు కరోనా లాక్డౌన్ టైమ్ అందరూ బయటకు వెళ్ళాలంటే భయపడుతున్నారు. ఆ సమయంలో పత్రి గారు పిలిచి నువ్వు కాస్త దీని మీద దృష్టి పెట్టు అని చెప్పారు. అప్పుడు నేను భయపడకుండా బయటికి వచ్చి మొత్తం ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ అన్ని ప్రాంతాలు తిరిగి అందరి దగ్గరకు వెళ్ళి వారికి ధైర్యం చెప్పడం జరిగింది. అప్పటి పీఎంసీ కి మేనేజింగ్ డైరెక్టర్ అయినా నంద ప్రసాద్ ఇంటికి కూడా వెళ్ళడం జరిగింది. అప్పుడు నందా మీరే తిరుగుతుంటే నేను ఇంట్లో కూర్చుంటే బాగుండదు అని ఆయన కూడా బయటకు వచ్చి తిరగడం జరిగింది.

అందుచేత  మనలో మూర్ఖత్వం ఉన్నా, అహంకారం ఉన్నా గొప్ప వాళ్ళు చేసే పనులు అర్థం కావు. వాళ్ళు ఎప్పుడు మన ఎదుగుదల మన

లాభం కోసమే చూస్తారు. మనకు ప్రపంచమే తెలుసు కానీ ఆ స్థాయిలో ఉన్న వారికి ప్రకృతి అంతా తెలుసు. మనం ప్రపంచాన్ని బట్టి నడుచుకుంటాం. ఆయన ప్రకృతిని బట్టి నడుచుకుంటాడు. ప్రకృతిలో మనం ఏం చేస్తే లాభం పొందుతాం అని ఆయనకు తెలుసు. అది లోక విరుద్ధంగా ఉంటుంది కానీ ప్రకృతి అనుగుణంగా ఉంటుంది. మనకు అది కావాలి, అంటే ప్రకృతి సహకారం కావాలి. ఈ విషయం పత్రిగారి దగ్గర నేను గమనించాను.

ఇప్పుడు నేను చేసే పనులు కూడా చాలా మందికి విరుద్ధంగా కనిపించవచ్చు, కానీ ప్రకృతి అనుగుణంగా వెళ్ళాలంటే మనం సత్యాన్ని పట్టుకోవాలి, సత్యానికి అనుగుణంగా జీవించాలి. సత్యం చెప్పడానికి, సత్యంలో జీవించడానికి భయపడకూడదు, సత్యం చాలా కఠినమైంది. ఈ విషయం నాకు తెలుసు అందుకే ఎవరు ఏమనుకున్నా, ఎన్ని అనుకున్నా సత్యాన్ని వదిలిపెట్టను.

పత్రి గారు మనకు అందించినటువంటి, చెప్పినటువంటి, బోధించినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం అంటే సత్యాన్ని ఆశ్రయించడం అంటే ఆత్మను ఆశ్రయించడం అంటే సృష్టిలో గొప్పవాడైనటువంటి పరబ్రహ్మను ఆశ్రయించడం అని గుర్తుపెట్టుకోండి. "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చెప్పబట్టే పత్రి గారు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు అందుకే నేను కూడా దాన్ని వదిలిపెట్టలేదు.

కానీ మన సొసైటీలో చాలా మంది మాస్టర్స్ ధ్యానులని ఆకర్షించడానికి మ్యూజిక్ అని, గైడింగ్ అని పెడుతున్నారు. ఈ మ్యూజిక్, గైడింగ్ పెడితే మనసు దగ్గర ఆగిపోతారు. మనసు అసత్యం అని గుర్తుపెట్టుకోండి, అసత్యం అపజయం పాలవుతుంది. వాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు ఫెయిల్యూర్ అవుతారు, అడ్రెస్ లేకుండా పోతారు.

పత్రి గారు బోధించిన, బుద్ధుడు బోధించిన "శ్వాస మీద ధ్యాస"

ధ్యానాన్ని పట్టుకుంటే కచ్చితంగా సక్సెస్ అవుతారు. అంచలంచలుగా ఎదుగుతారు, గొప్పవారిగా  తయారవుతారు. జ్ఞానం లేని మూర్ఖులు ఏమంటారంటే అది మాస్టర్లు అవ్వచ్చు, మెడిటేటర్స్ అవ్వచ్చు పత్రి గారు చేయిస్తున్నారు కదా మ్యూజిక్ పెట్టి అంటారు.

పత్రిగారు మ్యూజిక్ పెట్టి చేయించారు, అలాగే ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని చెప్పారు. ఇందులో ఏది సరి అయినదో వివేకంతో నిర్ణయం తీసుకోవాలి. వివేకం ఉంటే సరైన నిర్ణయం తీసుకుంటారు వివేకం లేకపోతే తప్పు నిర్ణయం తీసుకుంటారు నష్టపోతారు.

అందుకే పత్రి గారు "నీలాగా నువ్వు ఉండవోయ్, నీలాగా ఉంటే నీకేం కష్టం, నువ్వు నాలాగే ఉండమాక, నేను చేసింది చేయకు... నేను చెప్పింది చేయి అని అన్నారు. అంటే ఇక్కడ ఆయన చెప్పడం "ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస" అని చెప్పారు, చేయించడం మ్యూజిక్ పెట్టి చేయించారు. కాని "శ్వాస మీద ధ్యాస" పెడితేనే ఎవరైనా సత్యాన్ని ఆశ్రయించగలరు.

**"తన మంచి కోసం చెబితే మూర్ఖుడు వాడిని శత్రువు చేసుకుంటాడు, వాడిని పొగిడిన వాడిని దగ్గర చేసుకుంటాడు"** అని విదురుడు చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అందరి మంచి కోరే చెబుతున్నాను, అందుచేత అసత్యాన్ని పట్టుకుని నష్టపోకుండా మూర్ఖులుగా కాకుండా వివేకవంతులుగా ఆలోచించండి.

::9::

**"మూర్ఖుడు తనకన్నా బలవంతుడితో సైతం పోరాడటానికి సిద్ధపడతాడు. అంతే కాదు తనకన్నా బలహీనుడిపై అనవసర బల ప్రదర్శన చేస్తాడు".**

మూర్ఖుడికి సరైన ఆలోచన ఉండదు, వివేకంతో ఆలోచించలేడు. మూర్ఖుడికి ఆలోచన తక్కువ, వివేకం ఉండదు. వివేకవంతులే సరిగా ఆలోచించగలుగుతారు, సరైన నిర్ణయం తీసుకుంటారు. వివేకం లేనివాడు సరి కాని నిర్ణయాలు తీసుకుంటాడు, భంగపడతాడు. భంగ పడడమే కాదు బాధ పడతాడు, అనవసరంగా ఇతరులతో గొడవ పడతాడు.

ఎవరి మీదైనా బల ప్రదర్శన చేయాలనుకున్నప్పుడు ముందు నీ బలాన్ని, ఎదటి వాడి బలాన్ని అంచనా వేయగలగాలి. మీరు అనుకోవచ్చు మాకేమి రాజ్యాలు లేవు, మేమేమి రాజులం కాదు, మా దగ్గర పెద్ద సైన్యాలు లేవు, ఎదుట రాజు యొక్క బలాన్ని అంచనా వేయడానికి అని.

కానీ మూర్ఖుడికి రాజ్యాలు అక్కర్లేదు. ప్రతి సందర్భంలో ప్రతి ఒక్కరితో వాడి ప్రవర్తన ఇలాగే ఉంటుంది. మీరు గమనిస్తే మీరు ట్రైన్ లో ప్రయాణం చేసేటప్పుడు సీట్ దగ్గర కొంతమంది గొడవ పడుతూ ఉంటారు. అలాంటప్పుడు ఎదుటి వాడు ఎంత బలవంతుడు చూసుకోకుండా వాడితో గొడవ పడితే వాడు తన బలాన్ని ఉపయోగించి నాలుగు తన్ని పక్కకు పంపుతాడు.

అటువంటి సందర్భం ఎదురైనప్పుడు వివేకంతో ఆలోచించి ఆ అధికారి దగ్గరకు వెళ్లి వాడి మీద కంప్లైంట్ చేస్తే వారే ఆ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపుతారు. అంతేకానీ ఎదుటి వాడి మీద గొడవపడి వాడి బలాన్ని అంచనా వేయకుండా వాడి చేత తన్నులు తిని భంగ పడటం, బాధపడటం అనేది అవసరం లేదు. అందుకే మూర్ఖుడిగా ఎదుటి వాడి మీదకు వెళ్ళకుండా, వివేకంతో ఆలోచించి ఆ సమస్య నుండి బయటపడాలి.

ఇక్కడ ఏదో రాజ్యాలు, యుద్ధాలు కాదు, ఈ రకమైన ప్రవర్తన

ఉండకూడదు అని చెప్పడానికే. ఇటువంటి ప్రవర్తన ఎవరికి ఉంటుంది అంటే మూర్ఖుడికి ఉంటుంది.

పూర్వం జరిగిన యుద్ధాలు కాదు ఇప్పుడు. ప్రతి కుటుంబంలో జరుగుతున్నాయి. భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చినప్పుడు శారీరకంగా బలవంతుడైన భర్త, భార్యను కొట్టడం చేస్తూ ఉంటాడు, మూర్ఖుడిలా వ్యవహరిస్తాడు. కానీ వివేకంతో ఆలోచించి ఎక్కడ తప్పుందో తెలుసుకొని దానిని సరిచేసుకుంటే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూర్ఖుడిలా ప్రవర్తిస్తే ఆ సమస్య ఇంకా జటిలం అవుతుంది.

భార్య అయినా, భర్త అయిన, ఎవరైనా సరే సమయ సందర్భాను సారంగా ప్రవర్తించాలి కాని మూర్ఖుడిగా ఆవేశంగా ప్రవర్తించ కూడదు. ఎదుటి వాడి బలాలు, బలహీనతలు కూడా గమనించుకోవాలి. అలా కాకుండా గొప్పకి పోయి "నా బలప్రదర్శన చూపకపోతే నన్ను లోకువ కడతారు" అనేటువంటి అభిప్రాయంతో ఉంటే వాడు మూర్ఖుడు క్రింద లెక్క.

మగ వారు శారీరక బలం చూపిస్తే, ఆడవారు నోటి బలం చూపిస్తారు. అలా ఒకరినొకరు అర్థం చేసుకోకుండా ప్రవర్తిస్తే ఆ సంసారం నరకప్రాయమే. అందుకే పత్రి గారు చెప్పినట్లు భార్యాభర్తలిద్దరూ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తే వారి సంసారం స్వర్గంగా మారుతుంది. ధ్యానం ద్వారా ఈ జన్మకు "నేను పురుష జన్మ తీసుకున్నాను" అని భర్త, ఈ జన్మకు "నేను స్త్రీజన్మ తీసుకున్నాను" అని భార్య తెలుసుకొని, ఆత్మగా జీవించాలని తెలుసుకుంటారు.

నేను చాలా చోట్ల తిరుగుతూ ఉంటాను కనుక అన్ని చోట్లా గమనిస్తూ ఉంటాను. భర్త బాధితులు ఉన్నారు, భార్య బాధ్యతలు ఉన్నారు. పూర్వం భార్యా బాధితులు తక్కువగా ఉండే వారు. కానీ ఈ కాలంలో భార్య బాధితుల సంఘాలు కూడా పెరుగుతున్నాయి. ఆడ వారు కూడా ఉద్యోగాలు చేస్తూ భర్త మీద ఆధారపడకుండా బ్రతుకుతున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు.

అందుకే భార్య బాధితులు కూడా పెరిగిపోయారు.

ఏది ఏమైనా అందరూ ఆత్మలే, ఆత్మలైన అందరూ కూడా రకరకాల అనుభవాల కోసం, పాఠాలు నేర్చుకొని జ్ఞానం పెంచుకోవడం కోసం స్త్రీ శరీరాలు తీసుకుంటారు, పురుష శరీరాలు తీసుకుంటారు. అందుచేత స్త్రీ ఎప్పుడూ స్త్రీ కాదు, పురుషుడు ఎప్పుడూ పురుషుడు కూడా కాదు. ఇది జ్ఞానం పెరిగే కొద్దీ అర్థమవుతుంది. అప్పుడు గొడవలు ఉండవు, విడాకులు ఉండవు, దూరం అవ్వడం ఉండదు.

నా సలహా ఏమిటంటే వీలైనంత మటుకు భార్యా భర్తలు ఇద్దరూ కలిసి భీమవరం రావటానికి ప్రయత్నించండి. మీ సంసారంలో ఉన్న అపోహలు అపార్థాలు తొలగిపోతాయి.

ఇద్దరూ సమానమైన జన్మల్లో ఉంటూ సమానంగా ఉన్నప్పుడు ఏ గొడవలు ఉండవు, అన్యోన్యంగా ఉంటారు. అలాగే సమానమైన గుణాల్లో ఉన్నప్పుడు గొడవలు కూడా ఉండవు.

పూర్వకాలంలో అంటే రాజుల కాలంలో యుద్ధాలు ఉండేవి, వాటిని ఉద్దేశించి వ్రాసి ఉండొచ్చు కాని, యుద్ధాలు అనేవి ఇప్పుడూ ఉన్నాయి, తేడా ఎక్కడంటే మన చుట్టూ ఉన్నవారి సంసారాల లోనే.

ఏది ఏమైనా ఒకటే చెప్తున్నా విదురుడు చెప్పిన దాంట్లో మనం గ్రహించవలసింది మనలో ఉన్న చెడు లక్షణాలు తొలగించుకోవాలి ఇది చాలా చాలా ముఖ్యం.

తమోగుణం నుండి బయట పడాలి అంటే తీవ్ర ధ్యాన సాధన చేయాలి. దాని కోసం భీమవరం రావాలి చాలా మంది మేము ఇంట్లోనే కూర్చొని ధ్యానం చేసుకుంటున్నాం కదండి అని అంటూ ఉంటారు. కానీ మీరు ఇంట్లో ఉండి ధ్యానం చేస్తే భీమవరంలో లాగా గంటలు గంటలు చేయలేరు, క్రమశిక్షణతో కూడా చేయలేరు, దాని మూలంగా మీరు శక్తిని పొందలేరు, విదురుడు చెప్పినట్లు మూర్ఖత్వపు లక్షణాలు నుండి బయట పడలేరు.

## ::10::

## "మూర్ఖుడికి సమయం విలువ ఏమిటో బొత్తిగా తెలియదు."

బుద్ధి ఉన్నవాడు, వివేకవంతుడు అయిన వాడిని చూస్తే స్పష్టంగా తెలుస్తుంది. మనం పత్రి గారి లాంటి వారిని గమనిస్తే బాగా అర్థమవుతుంది. ఆయన ఒక్క క్షణం వృధా చేయడు. ఆయన చెయ్యాలి అనుకున్న పని వాయిదా వేయడు. కానీ ఇవన్నీ మూర్ఖుడికి తెలియదు.

"మూర్ఖుడు" అంటే తమోగుణంలో ఉన్నవాడు. అసలు వాడికి ఈ జీవితం ఎందుకు? నేనెవరో? దేని కోసం భూమి మీదకు వచ్చాను? అనే విషయాలు తెలియవు. ఏదో జన్మించాను అన్నేది మాత్రమే వాడికి తెలుస్తుంది. అందుచేత ఉన్నంతలో అనుభవించి, తన సరదాలు తీర్చుకోవాలని చూస్తాడు.

ఏ మానవుడైనా తనకు ఇవ్వబడిన వాటిని మూడు రకాలుగా ఉపయో గించుకుంటాడు. 1.దుర్వినియోగం, 2.నిర్వినియోగం, 3.సద్వినియోగం.

1. మూర్ఖుడు దుర్వినియోగం చేస్తాడు, 2. మూఢుడు నిర్వినియోగం చేస్తాడు, 3. వివేకవంతుడు సద్వినియోగం చేస్తాడు.

అందుచేత మూర్ఖుడు ఎప్పుడు సుఖపడాలనే చూస్తాడు. తన సమయాన్ని సుఖపడటం కోసమే వినియోగిస్తూ ఉంటాడు.

మూర్ఖుడి లెక్కలో సుఖ పడటం అంటే ఖానా, పీనా, సోనా ఇంతకన్నా ఏం ఉండదు. తినడం కోసం జీవ హింస చేస్తాడు. వాటిని చంపడం, వండు కోవడం, వాటిని తినడం వీటి కోసమే తన సమయాన్నంతా కేటాయిస్తాడు.

వీరికి ఇంకొక దుర్గుణం ఉంటుంది "అతి నిద్ర". నిద్రకే చాలా సమయం వినియోగిస్తారు, చేయవలసిన పనులు వాయిదా వేస్తూ ఉంటారు.

పత్రి గారు కబీరు చెప్పినటువంటి సందేశం "కల్ కరే సో ఆజ్ కర్, ఆజ్ కరే సో అబ్ కర్, పర్ ప్రళయ్ హోగా" అంటే "రేపు చేయవలసిన పని ఈ రోజే చేయి, ఈరోజు చేయవలసిన పని ఇప్పుడే చేయి, రేపు ఏ ప్రళయం వస్తుందో ఎవరికి తెలుసు" అని చాలా సార్లు చెప్పడం జరిగింది.

మీ సమయాన్ని వృధా చేసుకోకూడదు అని పత్రి గారు చెప్పారు.

నేను మీ అందరికీ ఒకటే చెబుతున్నాను మీరు భీమవరం వచ్చినా, జూమ్ లోకి వచ్చినా కచ్చితంగా 350 జన్మలు దాటిన వారే, లేకపోతే రాలేరు. మరి ఇన్ని జన్మలు తీసుకుని ఈ స్థాయిలో ఉన్న మీరు మూర్ఖునిలా సమయం యొక్క విలువ తెలుసుకోకపోతే మీరు కూడా వారి జాబితాలోనే చేరిపోతారు.

వివేకవంతుడు గొప్పవారిని చూసి నేర్చుకుంటాడు, తన ప్రవర్తనను మార్చుకుంటాడు. మూర్ఖుడు చూసినా సరే వారిలో మార్పు రాదు.

ఎందుచేతనంటే ఈ దేహం నేను కాదు, నేను ఆత్మను అని తెలుసుకున్న వాడికి, వివేకం ఉన్నవాడికి ఇది అర్థమవుతుంది.

చూడండి లోకంలో చాలామంది దేహం కోసం, దేహ లాభాల కోసం, దేహ సుఖం కోసం, దేహాలంకారం కోసం, దేహ సౌష్టవం కోసం అంటే బాడీ ఫిట్‌నెస్, దేహం యొక్క గొప్పతనాన్ని ప్రదర్శించడం కోసం తమ సమయాన్ని వినియోగిస్తారు. మానవుడు అంటే దేహం కాదు ఆత్మ అన్న విషయం తెలియక తమో గుణంలో ఉండే వారి సమయాన్ని దేహం కోసం వినియోగిస్తూ ఉంటారు. ఇటువంటి వారందరూ మూర్ఖులు అని మనం చెప్పుకోవచ్చు.

మానవుడు అంటే దేహం కాదు ఆత్మ అని తెలుసుకొని ఆత్మోద్ధరణకు సంబంధించిన పనులు చేయడానికి తన సమయాన్ని వినియోగించుకోవాలి అని వివేకవంతుడు తెలుసుకుంటాడు. వివేకవంతుడు తన సమయాన్ని ధ్యాన సాధన కోసం, జ్ఞానం పొందడం కోసం మాత్రమే వెచ్చిస్తాడు.

విదురుడు చెప్పినట్లు మీరందరూ కూడా మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి కానీ మూర్ఖుడిలా దుర్వినియోగం చేసుకోకూడదు. సమయం విలువ తెలుసుకొని మీ సమయాన్ని తీవ్ర సాధన కొరకు, జ్ఞానం పొందటం కొరకు వినియోగించాలి. అలా చేయాలి అంటే మీరు తప్పకుండా ప్రతినెలా 1,2,3 తారీఖులలో భీమవరంలో జరిగే ధ్యాన యజ్ఞంలో పాల్గొని మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోండి.

::11::

**విదురుడు ఇంకా “మూర్ఖుడు అందరిని అనవసరంగా అనుమానిస్తాడు”**

లోకంలో రకరకాల అపోహలు ఉంటాయి. అపోహ అంటే అనుమానం. సంసారంలో ఇలాంటి అపోహలు ఎన్నో ఉండడం వల్లే సంసారం సాఫీగా ఉండదు. చూడండి అందంగా ఉన్న భార్య బయటికి ఎక్కడికైనా వెళ్లి వస్తుంటే భర్తకి అనుమానం. అలాగే భర్త లేటుగా ఇంటికి వచ్చాడు అనుకోండి భార్యకు అనుమానం

చాలామంది భర్తలకి కొన్ని అలవాట్లు ఉంటాయి. సహజంగా భర్త జీతం తెచ్చుకోగానే ముందు భార్యకే ఇస్తాడు. ఏదో కొద్దిగా తను ఉంచుకుంటాడు ఎందుకంటే! ఇంటి ఖర్చులన్నీ చూసుకునేది భార్య కాబట్టి.

కొంతమంది భర్తలు వచ్చిన జీతం 50 వేలు అనుకోండి ఒక 20 వేలో, 25 వేలో ఇస్తాడు. మిగతాది ఇవ్వడు. ఏమండీ సంసారానికి ఎక్కువ ఖర్చు అవుతుందా? వాడి సొంతంగా ఎక్కువ ఖర్చవుతుందా? మరి ఈయన ఏమి చేస్తున్నాడు అని అనుమానం వస్తుంది. ఆ భార్యకి సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోతే కచ్చితంగా ఆవిడకి అనుమానంగానే ఉంటుంది.

భర్త భార్యను అనుమానించడం, భార్య భర్తను అనుమానించడం అన్నది మూర్ఖత్వపు స్వభావం. ఆ భార్య ఏ పురుషుడుతో మాట్లాడినా, కాస్త చనువుగా ఉన్నా వీడికి అనుమానమే, ఇది సహజంగా జరిగేదే!

ఇవి అనవసరమైన కలహాలకు దారి తీస్తాయి. అలా ఒకరి మీద ఒకరికి ఈ అనుమానాలు, అపోహలు ఉండకూడదు అంటే? ఎదటివారు అపోహ పడుతుంటారు అని అర్థం చేసుకొని, దానికి తగ్గట్టు వివరణ ఇచ్చినప్పుడు అపోహలు ఉండవు. లేకపోతే ఇది పెరిగి పెరిగి గొడవలకు కూడా దారితీస్తుంది.

ఎవరికి వారు వాళ్ళని, వీళ్ళని అనుమానించడం కాదు, అపోహలు

లేకుండా అన్యోన్యంగా జీవిస్తే ఆ సంసారం చాలా సుఖంగా ఉంటుంది.

మనకి బాగా అర్థం అవ్వటానికి రవిని, సింధూరని ఉదాహరణగా తీసుకుందాము. రవి వచ్చే జీతంలో కొంత సింధూరకి ఇచ్చి, మిగతా డబ్బు ఖర్చులు గురించి చెప్తాడు.

అబ్బాయి చదువుకి ఎంత ఖర్చు పెడుతున్నాడు, లోన్ తీసుకుని దానికి కొంత కడుతున్నాడు, EMIలు కడుతున్నాడు, అలాగే ఇప్పుడు ఇద్దరు అన్నిచోట్లకు వెళ్లి క్లాసులు చెప్తున్నారు చాలా ఖర్చు అవుతుంది, ఇలాగ వరసపెట్టి అన్ని చెప్తాడు. ఇంక అపోహలు ఎక్కడ ఉంటాయి?

కొంతమంది ఆవిడకి నేను ఎందుకు చెప్పాలి అనుకుంటారు. కానీ దాపరికం లేకుండా భార్యకి చెప్పేస్తె నిజంగా ఆ సంసారం చాలా సుఖంగా ఉంటుంది.

అలాగే భార్య కూడా భర్తకు అనుమానం కలిగించే విషయాల్లో ఎప్పటికప్పుడు వివరణ ఇస్తూ ఉంటే ఆయనలో ఉన్న అపోహలు కూడా తొలగిపోతాయి.

అందుకే ముందు బుద్ధి స్థితికి రండి అంటాను, బాగా అర్థం చేసుకుంటారు. డైరెక్టుగా అడగకపోయినా తెలివిగా ప్రశ్నించడం వల్ల వాళ్ళ అనుమానం తొలగించుకుంటారు.

భార్యలో వివేకం ఉన్నా, భర్తలో వివేకం ఉన్నా సహజంగా అడగ కుండానే వాళ్ళకి క్లారిఫికేషన్ ఇస్తారు. ఏ కారణం చేత అయినా చెయ్యక పోయినా తన తెలివితో ఆ అనుమానం తొలగించుకుంటారు. ఇది జరగ నప్పుడు ఈ అనుమానాలు పెరిగిపోయి సూటి పోటి మాటలు మొదలై చివరకు గొడవలుగా తయారై ఏ స్థాయికి వెళ్ళిపోతుంది అంటే ! విడాకులు దాకా వెళ్ళిపోతుంది.

కొంచెం ఆలోచించండి అసలు పిల్లలు పుట్టారు వాళ్ళు పెద్దవాళ్ళు అవుతున్నారు, చదువుతున్నారు అక్కడ విడాకులు ఏమిటి? అంత ఎదిగిన

తర్వాత గొడవలు ఏమిటి? అంటే అనుమానమే దానికి కారణం . భర్తను భార్య నమ్మకపోవడం, భార్యని భర్త నమ్మకపోవడం. ఇలా జరిగినప్పుడే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది.

కానీ ఒకటి మటుకు గుర్తుంచుకోండి భర్తకి భార్య అవసరమే భార్యకి భర్త అవసరమే!భార్య లేకుండా భర్త జీవించడం కష్టమే భర్త లేకుండా భార్య జీవించడం కష్టమే, దుర్భరమే.

ఏవైనా భేదాభిప్రాయాలు వచ్చినా పట్టించుకోకుండా ఉన్నట్లయితే దాన్ని సర్దుకుపోవటం అంటారు. చాలా సంసారాలు అలాగే సాగుతున్నాయి.

అలాగే భర్త లేకుండా భార్య కూడా ఉండలేదు, ఎందుకు ఇవన్నీ నేను చెప్తున్నాను అంటే నాకు చిన్నప్పుడు ఒక ఆలోచన వచ్చింది వీళ్ళు పెళ్లి చేసుకోకుండా ఎందుకు ఉండలేరు అని. తర్వాత తర్వాత స్వానుభవంతో భార్య అవసరం ఏమిటో అర్థమైంది.

మేడం ఈ రకంగా క్లాసులు చెప్తుంది అని నేను ఊహించలేదు నేను ఈ రకంగా క్లాసులు చెప్తానని ఊహించలేదు. మా జీవితాలు ఇలా మారిపోతాయని కూడా మాకు తెలియదు. అప్పుడు మా దగ్గర ఏ జ్ఞానం ఉంది? ఇవన్నీ ఊహించే శక్తి ఎక్కడ ఉంది? ఏదో అందరిలాగే మేము చేసుకున్నాము.

మానవుడికి ఉండే అవసరాలు అని చెప్పుకుంటాము అందులో కూడు, గూడు, గుడ్డ, తోడు అవసరమే! ఏది లేకపోయినా జీవించడం కష్టమే అని గుర్తుపెట్టుకోండి.

అందుకే కొంతమంది తల్లిదండ్రులు ఏమంటారు అంటే వాళ్ళ పిల్లలకి 25 ఏళ్ళు వచ్చినా 30ఏళ్ళు వచ్చినా అబ్బే మా పిల్లలు ఇంకా చిన్న పిల్లలే అంటారు. పెళ్ళిళ్ళు చేయటానికి ప్రయత్నం చెయ్యరు. ఇంక ఏంచేస్తారు? వాళ్ళే చేసుకుంటారు. చేసుకున్నాక మళ్ళా వీళ్ళు ఏడుస్తారు చేసేసుకున్నారు అని' ఇలా చాలా కేసులు ఉంటాయి.

ఇది ప్రకృతిలో ఉన్నటువంటి ఏర్పాటు, అంటే మానవుడికి కూడు ఎంత అవసరమో , గుడ్డ ఎంత అవసరమో, ఉండటానికి గూడు ఎంత అవసరమో తోడు కూడా అంతే అవసరము. ఈ ఏర్పాటు ప్రకృతి చేసింది. మీరు ఒక్కసారి త్రివిధాలు అనే పుస్తకం చదవండి చాలా మంచి పుస్తకం .

మానవునికి ఉన్న అవసరాలు ఎందుకు తప్పని సరైనవి అంటే ప్రతి మానవుడు అంటే స్త్రీ అవ్వచ్చు పురుషుడు అవ్వచ్చు రెండు రకాల అగ్నులు ప్రజ్వరిల్లుతుంటాయి. 1. జఠరాగ్ని 2. కామాగ్ని ఈ రెండు రకాల అగ్నులు ప్రజ్వరిల్లుతూ ఉంటాయి.

అవి చల్లార్చకపోతే ఆ అగ్నులు వాళ్ళని దహించి వేస్తాయి. స్త్రీ అయినా పురుషుడైన అవి ధహిస్తూ ఉంటే తట్టుకోలేరు. ప్రకృతిలో ఏర్పాటు ఏమిటి అంటే పుట్టగానే అంటే తల్లి గర్భంలో నుంచి బయటికి రాగానే జటరాగ్ని ప్రజ్వర్లితూ ఉంటుంది.

కానీ, యుక్త వయసు రాగానే అంటే యవ్వనం రాగానే కామాగ్ని ప్రజ్వరిల్లు తుంది. ఈ రెండు చాలా అవసరాలండి కూడు లేకపోతే జీవించడం ఎంత కష్టమో తోడు లేకపోతే జీవించడం అంతే కష్టం.

అందుచేత తోడు వెతుక్కోవడమే కాదు, దానితోపాటు ఇంకా ఎన్నో అవసరాలు ఉంటాయి. ఇద్దరు ఒకటైన తర్వాత అవన్నీ అమర్చుకోవడం కోసం డబ్బు అవసరం వస్తుంది. ఇక్కడ రెండు అవసరాలు కనిపిస్తాయి. 1. డబ్బు సంపాదించవలసిన అవసరం వుంది.

2. ఇల్లు సంసారం నిర్వహించవలసిన అవసరం ఇంకోటి ఉంటుంది.

అందుచేత ఒకటైన ఈ భార్యాభర్తలు ఈ రెండు బాధ్యతలు పంచుకుంటారు. భర్త సంపాదించే బాధ్యత చూసుకుంటాడు. భార్య సంసారాన్ని పోషించే బాధ్యత తీసుకుంటుంది. ఇద్దరూ కలిసి ఇలా సంసారాలు సాగుతూ ఉంటాయి.

::12::

## “మూర్ఖుడికి దైవ ప్రీతి, పాప భీతి ఉండవు”.

మూర్ఖుడికి దైవం మీద నమ్మకం ఉండదు, దైవం అంటే ఇష్టం ఉండదు ఇంకా దేవుడు ఎక్కడున్నాడు? అని వాదిస్తాడు, దైవం ఉన్నాడా? లేడా? అని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడు, తనకు తెలిసినదే కరెక్ట్ అని తాను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్ళు అన్నట్టు ప్రవర్తిస్తాడు.

మూర్ఖుడు దైవాన్ని నమ్మడు కాబట్టి పూర్వం ఆది శంకరాచార్యల లాంటి పెద్దవారు గుడులను కట్టించి వాటిలో విగ్రహాలను ప్రతిష్టింపచేసి, ఆ విగ్రహమే దైవంగా భావించి పూజలు చేయించడమే కాదు, మానవుడు పాపం చేస్తే ఆ దైవం శిక్షస్తుంది అనే నమ్మకాన్ని కలిగించారు. అలా సమాజంలో అందరూ పద్ధతిగా జీవిస్తారని విగ్రహారాధనను ప్రవేశపెట్టారు. దేవాలయంలో చేసే ప్రతి పని వలన పుణ్య వస్తుంది అనే నమ్మకాన్ని కలిగించారు.

అలా మానవుడు తమోగుణం నుండి బయటపడి మెల్లిమెల్లిగా పాపాలు చేయడం తగ్గించి పుణ్య కర్మలు చేయడం ప్రారంభిస్తారు. అలాంటి పుణ్య కర్మలే అన్నదానాలు, వస్త్ర దానాలు అనేవి. ఇలా కొన్ని జన్మలు పుణ్య కర్మలు చేసి చివరకు సాత్విక గుణంలోనికి వచ్చి దైవ ప్రీతి అంటే “ఆత్మ మీద ఆసక్తి” పెంచు, ఒక సద్గురువును ఆశ్రయించి, ఆయన సాంగత్యంతో జ్ఞానాన్ని పొంది, పుణ్యకర్మలు కాకుండా ముక్తి కర్మలు చేయడం ప్రారంభిస్తాడు. అలా చేస్తూ చివరకు వాడి యొక్క జన్మలను తగ్గించుకుంటాడు. ప్రతినెలా భీమవరం వచ్చేవారు, ప్రతి రోజు జూమ్‌లో పాల్గొనేవారు అందరూ కూడా ఇలాంటి వారే.

మూర్ఖుడికి పాపభీతి ఉండదు. పాపం చేస్తే దాని ఫలితం అనుభవించాలి, ఆ ఫలితం చాలా నరకప్రాయంగా, చాలా దుఃఖ భరితంగా ఉంటుంది, దాన్ని తట్టుకోవడం కష్టం అని, పాపం అనేది చేయకుండా ఉంటే

మంచిది అనే అవగాహన కూడా ఉండదు మూర్ఖుడికి. దైవాన్ని నమ్మనివాడు జ్ఞానం లేకపోవడం వలన ఎక్కువ తప్పులు, పాపాలు చేస్తూ ఉంటాడు. నాకేం కష్టం రాలేదు కదా? అని అనుకుంటాడు. కానీ పాపం పండితే ఎవరికైనా కష్టాలు తప్పవు. ప్రారంభ జన్మలో ఉన్నవాళ్లే తప్పులు, పాపాలు చేస్తూ మూర్ఖుడిలా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇలాంటి వారు తమోగుణంలో ఉండటం వలన ధ్యానం గురించి చెప్పినా వారికి బోధపడదు. ఇలాంటి వారిని పట్టించుకోకుండా వదిలివేయటమే మంచిదని పత్రి గారు చెప్పడం జరిగింది.

మీరు బయట క్లాసులు చెప్పడానికి వెళ్ళినప్పుడు విగ్రహారాధన కాదు, ఆత్మ ఆరాధన చెయ్యాలి, మాంసాహారం తినకూడదు అని చెప్పినప్పుడు కొంతమంది మూర్ఖంగా వాదిస్తూ ఉంటారు. అలాంటివారితో వాదనకు దిగకుండా వదిలివేయటమే మంచిది. ఇలాంటి వారందరికీ శాకాహారానికి సంబంధించిన పుస్తకాలను ఇవ్వటం మంచిది. వాటిని చదువుకొని, అర్థం చేసుకొని మారటానికి అవకాశముంటుంది.

సహజంగా పాప పుణ్యాలు అనేవి మానవులకు సంబంధించినవే అనుకుని జంతువులను హింసించడం పాపం కాదు అనే భావంతో మాంసభక్షణ చేస్తూ ఉంటారు. కానీ ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన వారికి ప్రాణమున్న ప్రతి జీవి ఆత్మస్వరూపమే అని తెలుసు. మీరు గమనిస్తే లోకంలో సాటిమనిషి హింసించినా, చంపినా చట్ట రీత్యా నేరం దానికి తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుంది, కానీ తోటి జీవిని హింసించినా, చంపినా సమాజంలో ఎటువంటి శిక్ష ఉండదు. కానీ భగవంతుని లెక్కలో దానికి తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్న విషయం తెలుసుకున్నవారు పాపాలు చేయరు, కష్టాలపాలవరు.

## ::13::

## "సందర్భం లేకుండా మాట్లాడేవాడు మూర్ఖుడు".

దీనికి ఉదాహరణగా మనం రైలులో జరిగే సంఘటనలే తీసుకోవచ్చు. రైలులో ప్రయాణించేటప్పుడు కొంతమంది రకరకాల విషయాలు మాట్లాడు కుంటూ ఉంటారు. అలాంటి సందర్భాలు మీకు ఎదురైనప్పుడు వారి మాటల్లో తలదూర్చి సందర్భం లేకుండా మాట్లాడి వారితో గొడవలు పడడం మూర్ఖుడి యొక్క లక్షణం.

అలా కాకుండా మీరు సైలెంట్ గా ఒక పుస్తకం తీసుకొని చదువు కోవడం, లేకుంటే ఒక వీడియో వినడం చేయాలి, అంతే గాని అనవసరమైన మాటలలో తలదూర్చకూడదు.

ఇంకా కొంతమంది  ధ్యానం గురించి బోధించాలి అని చూస్తారు, కానీ వారికి ఆసక్తి ఉంటేనే  చెప్పాలి, ఆసక్తి లేకుండా వారికి చెప్తె కూడా మూర్ఖుడి యొక్క లక్షణమే.

నేను  చాలా సార్లు ట్రైన్ జర్నీ చేసేటప్పుడు నా సమయాన్ని వృథా చేసుకోకుండా బుక్స్ కరెక్ట్ చేస్తూ ఉంటాను. అటువంటప్పుడు నా ప్రక్కన ఉన్న వారు ఆ పుస్తకాల మీద ఆసక్తి చూపించినప్పుడు, నేను వాటి గురించి వివరిస్తాను అంతే గాని వారు అడగకుండా నేను ఏమి చెప్పను, నా సమయాన్ని వృథా చేసుకోను, ఇది వివేకవంతుల యొక్క లక్షణం.

మీ వివేకం పెరిగే కొద్ది ఈ విషయాలు అన్ని మీకు అర్థమవుతాయి. మీరు చేసే పనులు కానీ, మాట్లాడే మాటలు కానీ సందర్భానుసారంగా ఉండాలి. కొంతమంది వారికి తెలిసిన విషయాన్ని చెప్పాలి అనే ఆత్రుతతో ఉంటారు కానీ సందర్భం వచ్చినప్పుడు మాత్రమే చెప్పడం వివేకవంతుల లక్షణం.

ఆత్మలైన మీరు ఆత్మోన్నతికి సంబంధించిన మాటలే మాట్లాడాలి, పనులు చేయాలి. మీ సమయాన్ని, మీ ధనాన్ని వృథా చేసుకోకుండా ఆత్మోద్ధరణకు పాటుపడాలి.

## ::14::

**"మూర్ఖుడు తన తప్పులను కప్పి పుచ్చుకొని ఎదుటి వాడి తప్పులను ఎత్తిచూపుతూ ఉంటాడు."**

సహజంగా ఈ లక్షణం ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. తనలో ఏతప్పు లేనట్టు ఎదుటి వారి తప్పులను ఎంచుతూ ఉంటారు. మన పెద్దలు "మీరు ఎదుటి వాడి వైపు ఒక వేలు చూపిస్తే మిగతా మూడు వేళ్ళు మీ వైపు చూస్తున్నాయి అని గమనించుకోండి" అని చెబుతుంటారు. అంటే ఎదుటి వాడిలో ఒక తప్పుని చూస్తే మీలో మూడు తప్పులు ఉన్నట్టు అర్థం చేసుకోండి.

తన తప్పుల గురించి తెలుసుకొని వాటిని సరిచేసుకోకుండా ఇతరుల తప్పుల గురించి ఆలోచించేవాడు మూర్ఖుడు. అజ్ఞానంలో ఉన్నవాడు ఇలా ప్రవర్తిస్తూ ఉంటాడు. దాని వలన జీవితంలో ఎన్నో కష్టాలు తెచ్చుకుంటూ ఉంటాడు. తమోగుణంలో ఉన్నవారికే ఈ మూర్ఖత్వపు లక్షణాలు ఉంటాయి కాబట్టి తీవ్ర ధ్యాన సాధన ద్వారా తమోగుణం నుండి బయటపడటానికి ప్రయత్నించాలి.

ఇటువంటి మూర్ఖపు లక్షణం కుటుంబంలోని భార్య భర్తల మధ్య ఉండటం మనం గమనించవచ్చు. భార్య తప్పులను భర్త ఎత్తి చూపటం, భర్త తప్పులను భార్య ఎత్తి చూపటం చేస్తూ ఉంటారు. దాని వలన సంసారంలో అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. ఇటువంటి లోపం ఉన్నవారు దాన్ని సరిచేసుకుంటే వారి సంసారం శాంతియుతంగా, సంతోషకరంగా సాగిపోతూ ఉంటుంది. పత్రి గారు "కుటుంబంలోని భార్యాభర్తలిద్దరూ ధ్యానం చేస్తే వారి సంసారం స్వర్గం అవుతుంది" అని చెప్పడం జరిగింది.

మీ జీవితానికి మీరే సృష్టికర్తలు కాబట్టి మీ జీవితాన్ని మీరే మార్చుకోవాలి. అందుకే ప్రతి ఒక్కరూ తీవ్ర ధ్యాన సాధన చేస్తే మీలో ఉన్న లోపాలు సరిచేసుకోగలుగుతారు. ఈ లోపాలు అనేవి మనసు మలినంగా

ఉన్నప్పుడు ఉంటాయి కనుక ధ్యానం ద్వారా మనసు శుద్ధి చేసుకుంటే ఈ లోపాలను సరిచేసుకోవచ్చు.

ఎంత డబ్బు సంపాదించినా, ఎన్ని వస్తువులు సమకూర్చుకున్న మీలో ఉన్న ఇటువంటి లోపాలను సరిచేసుకోకపోతే సుఖంగా జీవించలేరు. బుద్ధుడిని ఒక శిష్యుడు "మీరు ధ్యానం ద్వారా ఏమి సంపాదించారు?" అని అడిగినప్పుడు "నేను ధ్యానం చేయడం వలన సంపాదించలేదు కానీ చాలా పోగొట్టుకున్నాను అని బుద్ధుడు చెప్పాడు. ఏమి పోగొట్టుకున్నారు అంటే? నాలో ఉన్న కోపం, అసూయ, ద్వేషం, అహంకారం, మమకారం లాంటివి పోగొట్టుకున్నాను అని బుద్ధుడు చెప్పడం జరిగింది.

ఒక ఎలైట్మెంట్ మాస్టర్ మంచి చేసేవాడి నుంచి, చెడు చేసేవాడి నుంచి కూడా నేర్చుకుంటూ ఉంటాడు. మంచి చేసేవాడిని చూసి వాడిలా ఉండాలి అని, చెడు చేసే వాడిని చూసి వాడిలా ఉండకూడదని నేర్చుకుంటాడు. ఎప్పుడైతే తీవ్ర ధ్యాన సాధన చేస్తారో మీలో ఉన్న లోపాలు అన్ని సహజంగానే పోగొట్టుకుంటారు. మీరు ఎంతగా ధ్యానం చేస్తే అంతగా ఎదుగుతారు. ఎదగడం అంటే మీలో దైవ లక్షణాలను పెంపొందించుకోవడం, చివరకు మీరే దైవాలుగా మారుతారు, ఈ జన్మనే ఆఖరి జన్మ చేసుకోగలుగుతారు.

అందుకే ప్రతిఒక్కరిని ప్రతి నెలా 1,2,3 తారీఖులలో భీమవరంలో జరిగే మూడు రోజుల ధ్యాన యజ్ఞానికి హాజరు అవ్వమని చెబుతూ ఉంటాను. అక్కడ మాత్రమే మీరు తీవ్ర ధ్యాన సాధన చేయగలుగుతారు, మీ మనస్సును శుద్ధి చేసుకొని మీలోని లోపాలను సరి చేసుకోగలుగుతారు.

# పిరమిడ్ మాస్టర్ల 18 ఆదర్శ సూత్రాలు

1. సరియైన ధ్యానం అంటే "ఆనాపానసతి" ధ్యానం చేయడం, అందరి చేతా చేయించడం.
2. సరియైన ఆధ్యాత్మిక పుస్తకాలను చదవడం; వాటినే అందరి చేతా చదివించడం.
3. ధ్యానానుభవాలనూ, పుస్తక జ్ఞానాన్నీ విధిగా అందరూ పరస్పరం పంచుకోవడం.
4. విధిగా పౌర్ణిమ ధ్యానం చేయడం ; అందరిచేతా పౌర్ణమి ధ్యానాన్ని చేయించడం.
5. వీలయినంత మౌనం పాటించడం.
6. వీలయినప్పుడల్లా పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం.
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి.
8. మాంసాహారం ససేమిరా తినకపోవడం! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమిత ఆహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్నప్పటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ ఇవ్వడం.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణలో 'డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలు' అన్నది ఏ మాత్రం లేకపోవడం.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ సత్యఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. ఎవరి సమస్యలను వారే, తమ తమ స్వీయ ఆత్మశక్తిని ఉపయోగించి పరిష్కరించుకోవడం.
16. గృహస్థులుగా వుంటూనే, ఎవరి పనులు వారు చూసుకుంటూనే, జీవన్ముక్తిని సాధించడం.
17. అన్ని గ్రామాల లోనూ, అన్ని పట్టణాలలోనూ విధిగా పిరమిడ్ ధ్యానకేంద్రాలు నెలకొల్పడం.
18. పిరమిడ్ మాస్టర్లందరూ తమ తమ ధ్యానానుభవాలను గ్రంథరూపం చేసి విధిగా ప్రచురించాలి.

# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | Losses caused by Desires | Rs.100 |
| 7. | What is Meditation? | Rs.80 |
| 8. | True Path | Rs.80 |
| 9. | Why soul-knowledge | Rs.70 |
| 10. | What comes after death ? | Rs.70 |
| 11. | Learnings through the male and female births | Rs.70 |
| 12. | Who are Soul-murderes? | Rs.70 |
| 13. | How to improve Financial Status ? | Rs.60 |
| 14. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 15. | What is Intention? | Rs.50 |
| 16. | Why is this life? | Rs.50 |
| 17. | Shankaracharya's Jagrata panchakam | Rs.50 |
| 18. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 19. | Brahman means? | Rs.50 |
| 20. | How to become a master? | Rs.50 |
| 21. | How to become a champion ? | Rs.50 |
| 22. | Meditation for the Development of Students | Rs.40 |
| 23. | Non violence and vegetarianism | Rs.40 |

| | |
|---|---|
| REBIRTH (Tatavarthy Rajya Lakshmi) | Rs.150 |
| What is Ignorance (Avidya) ? | Rs.70 |

# తేటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) కబీరు సందేశాలు-1 -రూ.70/-
43) కబీరు సందేశాలు-2 -రూ.60/-
44) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
45) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
46) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
47) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
48) అతీంద్రియ శక్తులు - రూ.60/-
49) ఆలోచించండి - రూ.60/-
50) నిర్వాణ మార్గం - రూ.60/-
51) ధ్యానులకు సూచనలు - రూ.60/-
52) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
53) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
54) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
55) సంకల్పమంటే? - రూ.50/-
56) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
57) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
58) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
59) అరిహంత్ - రూ.50/-
60) చివటం అమ్మవారి సందేశాలు - రూ.50/-
61) మూడురకాల జీవితాలు -రూ.40/-
62) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
63) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
64) బ్రహ్మం అంటే? -రూ.40/-
65) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
66) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
67) మహాత్ముల సందేశాలు - రూ.40/-
68) సత్యం - రూ.40/-
69) చక్రాలు - రూ.40/-
70) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
71) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
72) మౌన ధ్యానం - రూ.40/-
73) విదురుని సందేశాలు - రూ.40/-
74) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
75) శాకాహారమే మానవాహారం - రూ.15/-
76) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



- “మూర్ఖుడు తనకే అన్నీ తెలుసు అని అనుకుంటాడు.”
- “మూర్ఖుడికి సమయం విలువ ఏమిటో బొత్తిగా తెలియదు.”
- “మూర్ఖుడు అందరిని అనవసరంగా అనుమానిస్తాడు”
- “మూర్ఖుడికి దైవ ప్రీతి, పాప భీతి ఉండవు”.
- “సందర్భం లేకుండా మాట్లాడేవాడు మూర్ఖుడు”.
- “మూర్ఖుడు తన శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించకుండా పగటి కలలు కంటూ ఉంటాడు.”
- “అధర్మ మార్గంలో ధనం సంపాదించాలనుకోవటం కూడా మూర్ఖుడి యొక్క లక్షణం” అని విదురుడు చెప్పారు.
- “కోపము, అసూయ లాంటివి తననే దహించి వేస్తాయనే వివేకం లేకుండా మాటి మాటికీ వాటిని ప్రదర్శించేవాడు మూర్ఖుడు.”
  “మూర్ఖుడు వంటి నిండా, నోటినిండా, చేతినిండా గర్వం నిండినవాడు.”
- “తన మంచి కోసం చెబితే మూర్ఖుడు వాడిని శత్రువు చేసుకుంటాడు, వాడిని పొగిడిన వాడిని దగ్గర చేసుకుంటాడు”

రూ.**40/-**

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **Telugu Books** | **English Books** | **Hindi Books** | **Kannada Books** | **Tamil Books** |